క్లుప్తంగా

మకరతోరణం బహూకరణ



మకరతోరణం బహూకరిస్తున్న రాకేశ్ దంపతులు

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీపెరికగిద్దె హనుమాన్ ఆలయంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి మార్కండేయకాలనీకి చెందిన సామల రాకేశ్–మౌనిక దంపతులు ఆదివారం మకరతోరణాన్ని బహూకరించారు. అర్చకుడు అభిలాష్, ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల రామేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ పోచన్న, సామల హరికృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో మనోహర్‌రెడ్డి, ముస్లింలు

కాల్వశ్రీరాంపూర్: మండలకేంద్రంలోని మసీదులో ఆదివారం ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రజుమంలో మాజీ ఎంపీపీ సంపత్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రమేశ్



రమేశ్

సుల్తానాబాద్: జిల్లాకేంద్రంలోని ఆర్డీవో ఆఫీస్‌లో పనిచేస్తున్న గాండ్ల రమేశ్‌పటేల్‌ను నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా రమేశ్ మాట్లాడుతూ, తోటి ఉద్యోగులకు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఏకగ్రీవానికి సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

మన్‌కీబాత్ వీక్షించిన బీజేపీ నాయకులు



మన్‌కీబాత్‌లో బీజేపీ నాయకులు

గోదావరిఖని: ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీబాత్‌లో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. జనగామ మండల అధ్యక్షుడు గుండబోయిన భూమయ్య నివాసంలో టీవీలైవ్‌లో పాల్గొని వీక్షించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రధానమంత్రి మన్‌కీ బాత్ ద్వారా నేరుగా ప్రజలతో మాట్లాడుతూ, వారి అభిప్రాయాలు తెలుసుకుంటూ, అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఎస్సీ మోర్చా నాయకుడు ఎస్.కుమార్, రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, నాయకులు కోడూరి రమేశ్, కొమురవెల్లి విశ్వనాథ్, రాదండి శ్రీనాథ్, గొడుగు సమ్మయ్య, ఇట్యాల శ్రీనివాస్, గుండబోయిన సంతోష్, భువనగిరి మోహన్, పృథ్వీరాజ్, అందే రాజ్‌కుమార్, మామిడి వీరేశం, బండారి శ్యామ్, సంబోజు సురేశ్, ఏంపెల్లి ఉపేందర్, చుక్కల హరీశ్, రేడియం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులం వద్ద తల్లిదండ్రుల పడిగాపులు



పాఠశాల గేటు బయట పడిగాపులు కాస్తున్న తల్లిదండ్రులు

గోదావరిఖనిటౌన్: స్థానిక రమేశ్‌నగర్‌లోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల (గుంజపడుగు) వద్ద ఆదివారం పండగ పూట తమ పిల్లలను కలిసి పిండి వంటలు తినిపిచ్చేందుకు వచ్చిన తల్లిదండ్రులను లోనికి పంపించకుండా నిబంధనల పేరుతో నిర్వాహకులు గేటు బయటే ఉంచారు. చేసేదేమీ లేక ఎండలో తమ పిల్లల కోసం గేటు బయటే గంటల తరబడి వేచి ఉన్నారు. చివరికి అనుమతించడంతో పిల్లలకు తల్లిదండ్రులు పిండి వంటలు తినిపించి ఆనందపడ్డారు.

ఘనంగా విశ్వావసు వేడుకలు



రామగుండం: వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ



ముత్తారం: పంచాంగం చెబుతున్న పురోహితుడు



పెద్దపల్లిరూరల్: పంచాంగ శ్రవణంలో సంజీవరెడ్డి, తదితరులు



జూలపల్లి: ఎడ్ల బండ్ల పోటీలో విజయం సాధించిన రైతు

జిల్లావ్యాప్తంగా ఆదివారం విశ్వావసు నామ ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో హిందూవాహిని, ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో కంకటి రవిగౌడ్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. జూలపల్లి మండలం పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద సంకెన్ల లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించారు. అంతర్గాం జంక్షన్, రామగుండం అంబేడ్కర్ కూడలిలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. మంథనిలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు దంపతులు సర్వమతస్తులతో ఉగాది వేడుకలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో రద్దీ పెరగడంతో డ్రోన్ కెమెరాల సాయంతో పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. కాల్వ శ్రీరాంపూర్, సుల్తానాబాద్ పట్టణం, మండలం, ముత్తారం, ఎలిగేడు, రామగిరిలోని పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



మంథని: ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న పుట్ట మధు



జ్యోతినగర్: ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న మహిళలు

గోమాతకు పూజలు



గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో తమ్మడవేని మధుకర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి గోసేవ సమితి ప్రముఖ్ మల్లేశం హాజరై గోమాత వైభవం గురించి వివరించారు. కార్యక్రమంలో దిడ్డి శంకరయ్య, ఠాకూర్ కిషన్‌సింగ్, సత్యసింగ్, కొత్త మణికంఠ, కొంకటి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాలు పంపిణీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామంలోని శ్రీ కోదండరామాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు కొండపాక వెంకటాచార్యులు పంచాంగశ్రవణం నిర్వహించారు. అనంతరం హిందూ ప్రచార ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మెంగని చంద్రశేఖర్ భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. భక్తులకు శ్రీవారి కల్యాణ అంక్షింతలు, కంకణాలు అందజేశారు.

'విగ్రహాలు తొలగిస్తే సహించేది లేదు'



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని అంబేడ్కర్, పూలే విగ్రహాల తొలగింపునకు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఈ విధానాన్ని సహించేది లేదని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్ అన్నారు. పూలే, అంబేడ్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కార్పొరేషన్ అధికారులు అంబేడ్కర్ విగ్రహాలను తొలగించాలని, దళితులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విగ్రహాలను తొలగిస్తే సహించేది లేదని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు కాంపెల్లి సతీశ్, మంతెన లింగయ్య, బూడిద మహేందర్, పంజా అశోక్, పోగుల రంగయ్య, కనుకుంట్ల సమ్మయ్య, ఆర్నకొండ వెంకటేశ్వర్లు, శనిగరం రామస్వామి, ఎక్కిరాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజారత్నం, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కోకన్వీనర్ ఆకునూరి బాలంకూస్ అన్నారు. అంబేడ్కర్, పూలే జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం యైటింక్లయిన్‌కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. అంబేడ్కర్ అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా రాజ్యాంగాన్ని రచించిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేశ్, కరీం, చంద్రశేఖర్, ఆదినారాయణ, పోచయ్య, స్వామి, రాజ్‌కుమార్, రాంచందర్, రాజయ్య, రమేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మేడారం పార్కులో 'కోనోకార్పస్'

- ఏపుగా పెరిగిన చెట్లు
- తొలగించాలని గ్రామస్తుల డిమాండ్.. పట్టించుకోని అధికారులు



మేడారం పార్కులో కోనోకార్పస్ చెట్లు

ధర్మారం: పక్షులువాలని, ప్రాణాంతకమైన చెట్టు.. మనిషిని మింగే మానుగా పిలువబడుతున్న కోనోకార్పస్ చెట్లు ధర్మారం మండలం నందిమేడారం నడిబొడ్డున అమరేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన పార్కులో ఏపుగా విస్తరించాయి. ఈ మొక్కలతో మానవాళికి, జంతువులు, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని నిపుణులు చెప్తున్నప్పటికీ అవేవి పట్టించుకోకుండా పార్కులో నాటిన ఇలాంటి మొక్కలను ఇష్టారాజ్యంగా పెంచుతున్నారు. ఫలితంగా గ్రామస్తులకు వివిధ రకాల వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉంది.

అందం చాటున ప్రమాదం..

కోనోకార్పస్ మొక్కలు తొందరగా ఏపుగా పెరగడమే కాకుండా అందంగా కనిపిస్తాయి. దీంతో ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రకృతి వనాల్లో ఈ మొక్కలను నాటడానికి ప్రారంభంలో ఆసక్తి చూపించారు. అవెన్యూ ప్లాంటేషన్ పేరిట రహదారుల వెంట కూడా ఈ మొక్కలు నాటారు. అయితే ఈ మొక్కలతో పర్యావరణంతో పాటు ప్రాణాలకు ముప్పు ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో మండలంలో పలుచోట్ల నాటిన మొక్కలు ఏపుగా పెరుగగా గ్రామస్తులే తొలగించారు. కానీ, నందిమేడారం ప్రకృతి వనంలో మొత్తం కోనోకార్పస్ మొక్కలు నాటారు. వాటి సంరక్షణ కోసం నిత్యం నీటిని అందిస్తూ కొమ్మలను కత్తిరిస్తూ అందంగా తీర్చిదిద్దారు. ఈ అందం వెనుక ప్రమాదం దాగి ఉన్న విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు చెట్లను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

శ్వాసకోశ వ్యాధులు వస్తాయి



కోనోకార్పస్ చెట్ల మూలంగా శ్వాసకోశవ్యాధులు వస్తాయి. ఈ చెట్ల నుంచి ఏడాదికి రెండుసార్లు పూత వస్తుంది. ఈ పూత ద్వారా వచ్చే పుప్పాడి శ్వాస ద్వారా శరీరంలోకి వెళ్లి శ్వాసకోశ సమస్యలకు దారితీస్తుంది. వీటితో ఊపిరితిత్తుల వ్యాధి, ఎలర్జీ, అస్తమా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.

– గౌతంకుమార్, వైద్యాధికారి, మేడారం

చెట్లను తొలగించాలి



కోనోకార్పస్ చెట్ల నుంచి వెలువడే పుప్పాడి ప్రమాదకరమైనదని పర్యావరణవేత్తలు స్పష్టంగా పేర్కొంటున్నారు. గ్రామస్తులు వ్యాధుల బారిన పడకముందే వెంటనే ఈ చెట్లను తొలగించాలి.

– మిట్ట తిరుపతి, మాజీ ఎంపీటీసీ

పుర పేదలకేది 'ఉపాధి'..?

- జిల్లాలోని మున్సిపాల్టీల్లో పలు గ్రామాల విలీనం
- ఉపాధి హామీ పనులు లేక ఆయా గ్రామస్తుల ఇబ్బందులు

జిల్లాలోని మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాలు..	
సుల్తానాబాద్:	పూసాల, సుగ్లాంపల్లి
పెద్దపల్లి:	బంధంపల్లి, రంగంపల్లి, చందపల్లి
రామగుండం:	కుందనపల్లి, ఎల్కలపల్లి, లింగాపూర్



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

సుల్తానాబాద్: గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని ఆయా మున్సిపాల్టీల్లో సమీప గ్రామాలను విలీనం చేశారు. దీంతో విలీన గ్రామాల్లో వేలాది మంది పేదలకు ఉపాధి హామీ కరువైంది. పనులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పనుల కాలంలో పనులు దొరుకుతుండగా వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీ పనులు దొరకడం లేదు.

పంచాయతీల నుంచి మున్సిపల్‌గా..

గత ప్రభుత్వ హయంలో జిల్లాలోని సుల్తానాబాద్, మంథని మేజర్ గ్రామ పంచాయతీలు మున్సిపల్‌గా ఆవిర్భావించాయి. సుల్తానాబాద్ మున్సిపల్‌లో సుగ్లాంపల్లి, పూసాల గ్రామాలను విలీనం చేశారు. మంథని నేరుగా గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్‌గా ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు లేకుండా పోయాయి. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం వలె పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

వర్తించని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పేద కూలీలకు పథకం వర్తించకుండా పోయింది. తమ గ్రామాలు మున్సిపల్‌లో విలీనం కావడంతో తమకు పనులు లేకుండా పోయాయని పట్టణాల్లో కూడా ఉపాధి హామీ పథకం పనులు చేసేలా ప్రజాప్రతినిదులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

ఉపాధి కల్పించాలి



మా గ్రామం పంచాయతీగా ఉన్నప్పుడు వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పనులకు వెళ్లి ఉపాధి పొందిన. మున్సిపాలిటీలో విలీనం చేసిన అనంతరం పనులు లేక ఖాళీగా ఉండాల్సి వస్తుంది. మున్సిపల్‌లో పన్నుల భారం పెరిగింది.

– పుస్తెం గణేశ్, పూసాల, సుల్తానాబాద్

ప్రభుత్వమే ప్రవేశపెట్టాలి



రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం వలె పట్టణ పేద ప్రజలకు కొత్త పథకం ప్రవేశపెట్టాలి. పనులు లేని సమయంలో జీవనోపాధి పొందేలా ప్రత్యేక పథకాన్ని రూపొందించి సహాయం చేయాలి.

– గెల్లు శ్రీనివాస్, సుల్తానాబాద్

ప్రభుత్వ నిర్ణయం మేరకు..



కేంద్ర ప్రభుత్వం పట్టణాల్లో ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టలేదు. ప్రభుత్వం ప్రవేశపెడితే అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. సుల్తానాబాద్ ప్రాంతం వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో కూలీల సంఖ్య అధికంగానే ఉంది. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

– మహమ్మద్ నియాజ్, మున్సిపల్ కమిషనర్, సుల్తానాబాద్

ఆలయ అర్చకుడికి ఉగాది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న వెంకటేశ్వరశర్మ



అవార్డు స్వీకరిస్తున్న ఓదెలు

గోదావరిఖనిటౌన్: విశ్వావసు నామ సంవత్సరం ఉగాది– 2025కు గాను గోదావరిఖనిలోని శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయ ప్రధాన అర్చకుడు వొజ్జల వెంకటేశ్వరశర్మకు ఉగాది పురస్కారం వరించింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర సాంస్కృతిక, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి చేతుల మీదుగా నగదుతోపాటు పురస్కారం స్వీకరించారు. శ్రీకాశీవిశ్వేశ్వర శివాలయంలో వెంకటేశ్వరశర్మ 35 ఏళ్లుగా పంచాంగ శ్రవణం వినిపిస్తున్నారు. పురస్కారం లభించడంపై ఆయా ఆలయాల అర్చకులు అభినందనలు తెలిపారు.

కొండవేన ఓదెలుకు..

రామగిరి: నాగెపల్లి మాజీ సర్పంచ్ కొండవేన ఓదెలును ఉగాది పురస్కారానికి ఎంపిక చేశారు. గ్రామంలో ఆయన చేసిన సేవలను గుర్తించి ఆదివారం జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారం తిరుపతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న క్రాంతికుమార్ దంపతులు

మంథని: ఉగాది పర్వదినం సందర్భంగా మంథని మున్సిపల్ పరిధిలోని బోయిన్‌పేట పేద మహిళలకు కాలనీకి చెందిన పోతరవేని క్రాంతికుమార్ చీరలు పంపిణీ చేశారు. తమ ఇంటి ఆడబిడ్డలుగా భావించి సుమారు 800 మందికి చీరలు అందించినట్లు క్రాంతికుమార్ తెలిపారు. పండుగ వేళ అందరూ ఆనందంగా ఉండాలని తన వంతు సాయం అందించినట్లు పేర్కొన్నారు.

నెమలి అప్పగింత

ఓదెల: మండలంలోని జీలకుంట గ్రామంలోకి ఆదివారం జాతీయ పక్షి నెమలి ప్రవేశించగా గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బ్లూకోల్ట్స్ పోలీసులు నెమలిని స్వాధీనం చేసుకొని ఫారెస్టు బీట్ ఆఫీసర్ తిరుపతికి అప్పగించారు.

పోచమ్మ బోనాలు



కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో ఆదివారం మాదిగ కులస్తుల నేతృత్వంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. నెత్తిన బోనాలు, డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా పోచమ్మ గుడికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జూకంటి శిరీష తదితరులు పాల్గొన్నారు.